క్లుప్తంగా

మాజీ మంత్రి పువ్వాడను పరామర్శించిన కేటీఆర్



మాజీ మంత్రి అజయ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న కేటీఆర్

ఖమ్మంమయూరిసెంటర్: అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని పువ్వాడ నివాసానికి వెళ్లిన కేటీఆర్ ఆయన ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేటీఆర్ వెంట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు ఉన్నారు.

సినీతార తెచ్చిన ‘ఫైన్’..

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని వైరారోడ్‌లో ఓ జ్యూయలరీ షోరూం ప్రారంభోత్సవానికి సెలబ్రిటీగా సినీతార సంయుక్త మీనన్ వచ్చారు. షోరూం ఓపెనింగ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే వారితో పాటు సినీతారను చూసేందుకు శనివారం అభిమానులు రోడ్డు వెంట వాహనాలను నిలిపి పెద్ద సంఖ్యలో అక్కడకు చేరారు. సినీతారను చూసే ఆనందంలో వారు ఉండగా.. వాహనాలను ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి పార్క్ చేసిన వాహనాలకు ఫైన్ వేసే పనిలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు. వాహనాలను ఫైన్లు వేసిన వెంటనే మెసేజ్‌లు రావడంతో వాహనదారులంతా అవాక్కు చెందారు. వైరారోడ్‌లో అనేకచోట్ల దుకాణాల వెంట పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రహదారుల వెంట వాహనాలు నిలపాల్సి వస్తుందని, దీంతో ఫైన్లు వేస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ ఇల్లెందు క్రాస్‌రోడ్ పరిధిలోని 11 కేవీ కవిరాజ్‌నగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ తావుర్యా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కవిరాజ్‌నగర్ రోడ్ నంబర్లు 10, 11, 12, 13, 14లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు అభిప్రాయ సేకరణ

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి (పండితాపురం) గ్రామ పంచాయతీ పరిధి శ్రీ కృష్ణ ప్రసాద్ పశువుల వారంతపు సంత కౌలు నిర్వహణ బాధ్యతలను అప్పగించుట కోసం నేడు (సోమవారం) గ్రామస్తుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు ఎంపీడీఓ రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంత ఆవరణలో ఉదయం 8.30 గంటలకు నిర్వహించే ఈ గ్రామ సభకు గ్రామస్తులంతా హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని వైరా ప్రధాన రోడ్డులో గోపాలపురం వద్ద ఆదివారం ఆగి ఉన్న లారీని కార్గో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా.. స్థానికులు సమీప ఆస్పత్రికి తరలించారు. గాయపడిన డ్రైవర్ వివరాలు తెలియాల్సి ఉంది.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లికి చెందిన వృద్ధులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దుప్పట్ల పంపిణీకి సహకరించిన సుబ్బారావు, ఈశ్వర్‌ను అభినందించగా, నాయకులు సప్పిడి ప్రభాకర్, షేక్ చాంద్‌పాషా, రాంప్రసాద్, పోతుల ప్రసాద్, సాయి, నవీన్, త్రినాద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కల్కి
వినోద	భారతీయుడు 2
సాయిరాం	భారతీయుడు 2
ఆదిత్య	14(తెలుగు)
శ్రీనివాస	భారతీయుడు 2

- ఖమ్మంగాంధీచౌక్

డివిజన్లలో పనులైతలేవ్..!

నగరంలోని పలు డివిజన్లలో పారిశుద్ధ్యం పడకేసింది. డ్రెయినేజీలు, రహదారులు సక్రమంగా లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. చినుకుపడితే చాలు కొన్ని వీధులు బురదమయమై రాకపోకలు సాగించాలంటే నర(డ)కయాతన అనుభవిస్తున్నారు. మరికొన్ని చోట్ల డ్రెయిన్ల నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగునీరంతా రోడ్డుపై చేరి దుర్గంధం వెదజల్లుతోంది. అంతేకాక రోడ్లపై ఏర్పడిన గుంతలలో నీరు నిలిచి రోజుల తరబడి నిలుస్తుండడంతో కాలనీవాసులు నానా అవస్థలు పడుతున్నారు. – ఖమ్మంఅర్బన్/ఖమ్మం రాపర్తినగర్





గుంతలతో పాండురంగాపురంలోని 1వ లైన్ రోడ్డు, డ్రెయిన్ పైనే టాయిలెట్ నిర్మాణం చేసిన దృశ్యం

సక్రమంగా లేని రహదారులు, డ్రెయినేజీలు

- చినుకు పడితే వీధులన్నీ మురుగుమయం
- డ్రెయిన్లపై టాయిలెట్లు నిర్మిస్తున్న కొందరు
- రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్న జనం
- అపరిశుభ్రంగా మారిన లకారానికి నీటిని తరలించే సాగర్ కాల్వ తూము
- పట్టించుకోని మున్సిపల్ శాఖాధికారులు

పాండురంగాపురంపై పట్టింపు కరువు..

నగరంలోని 4వ డివిజన్ పాండురంగాపురం మొదటి లైన్ రహదారి అధ్వానంగా తయారైంది. మట్టి రోడ్డు కావడంతో గుంతలు పడి నీరు నిల్వడంతో రాకపోకలు సాగించాలంటే కష్టంగా మారుతుందని కాలనీవాసులు చెబుతున్నారు. అయితే కొంత మంది డ్రెయిన్ నిర్మాణాలపై టాయిలెట్ నిర్మాణం చేపట్టి సీసీ రోడ్డుకు ఆనుకుని ట్యాంక్ గుంతను తవ్వారు. దాని చుట్టూ కంచె ఏర్పాటు చేసి వాడుకున్న మురుగునీటిని అందులోకి వదలడంతో వీధంతా కంపుకొడుతోంది. ఈ విషయమై ఇప్పటికే కార్పొరేషన్ అధికారులు, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినట్లు కాలనీవాసులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గుంతల రోడ్డును బాగు చేసి, మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయడంతో పాటు



రాపర్తినగర్‌లో ఖాళీ స్థలాల గుండా వెళ్తున్న మురుగు

డ్రెయిన్‌పై నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలిగించాలని కోరుతున్నారు.

రాపర్తినగర్ శివారులో లేని రోడ్లు, డ్రెయిన్లు..

రాపర్తినగర్‌లో ప్రధాన రోడ్లు బాగున్నా.. శివారు ప్రాంతంలో రోడ్లు, డ్రెయిన్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు మూడు కిలో మీటర్లు విస్తరించి ఉన్న రాపర్తినగర్‌లో అత్యధికంగా ఉన్న శివారు ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వీటిని నిర్మించాల్సి ఉన్నా.. ఆ ప్రాంతంపై మున్సిపల్ శాఖ ఉదాసీనత వైఖరిని అవలంబిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నారు. డ్రెయినేజీలను నిర్మించకపోవడంతో ఖాళీ స్థలాల గుండా మురుగు ప్రవహిస్తూ.. ఆ ప్రాంత ప్రజలను వ్యాధులబారిన పడేలా చేస్తున్నాయి. అధికారులు నిర్లక్ష్యం వీడి డ్రెయిన్లు, రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

అపరిశుభ్రంగా సాగర్‌కాల్వ తూము..



అపరిశుభ్రంగా మారిన లకారం తూము ప్రాంగణం

సాగర్ నీటిని తాగునీటి అవసరాల కోసం విడుదల చేసినప్పుడు టేకులపల్లి వంతెన వద్ద ఉన్న తూము ద్వారా లకారం తాగు నీటి ప్రాజెక్టుకు తరలిస్తుంటారు. ఇందుకోసం తూము ప్రాంతంలో కాల్వకు అడ్డుగా తాత్కాలింగా కట్ట నిర్మాణం చేశారు. కాగా, ఆ ప్రాంతంలో వివిధ ప్రాంతాల నుంచి తెచ్చి పడేసిన చెత్త నిల్వలు, వర్షం నీటి తాకిడికి కొట్టుకొచ్చి మురుగుమయంగా తయారైంది. అంతేకాక కంపచెట్లు పెరిగి భయానకరంగా మారడంతో దీన్ని చూసిన వారంతా వామ్మో.. సాగర్ నీరు వదిలితే ఇదంతా కలుషితం అవుతుంది కదా అని చర్చించుకుంటున్నారు. సాగర్‌నీరు విడుదల కాక ముందే అక్కడ చేరిన చెత్త నిల్వలను శుభ్రం చేయాలని నివాసులు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది..



ఒక వైపు రోడ్డు గుంతలు పడి నడవలేక ఇబ్బంది పడుతుంటే.. డ్రెయిన్‌పై టాయిలెట్ నిర్మాణం చేపట్టడంతో దుర్వాసన వస్తోంది. అటుగా వెళ్లే సమయాన భరించలేని కంపు కొడుతోంది.ఈ విషయమై కార్పొరేటర్, కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇకనైనా మాకు న్యాయం చేయాలి.

– పెందోటి సోమేశ్వర్‌చారి, పాండురంగాపురం

అక్రమ నిర్మాణాలు తొలగించాలి..



సొంత జాగా ఉంచుకొని కూడా రోడ్డుపై నిర్మించిన డ్రెయిన్‌పై టాయిలెట్లు కడుతున్నారు. దీంతో రోడ్డుపై రాకపోకలు సాగించే వారికితో పాటు అటుగా వెళ్లే వారికి దుర్వాసన వస్తుండడంతో నరకం అనుభవిస్తున్నారు. రోడ్డును బాగు చేసి అక్రమ నిర్మాణాలను తొలగించాలి.

– జి.సుజాత, పాండురంగాపురం వాసి

పేద ఆర్యవైశ్య విద్యార్థులకు చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న కృష్ణమూర్తి, పక్కన కృష్ణారావు, తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని వాసవీ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 120 మంది పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఆదివారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసవీ గార్డెన్స్ అధ్యక్షులు చెరుకూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. పేద విద్యార్థుల చదువుల కోసం ప్రతి ఏటా రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు మాట్లాడుతూ.. ఈ ఏడాది 80 మంది విద్యార్థులకు రూ.10 వేల చొప్పున, 40 మంది విద్యార్థులకు రూ. 5వేల చొప్పున మొత్తం 120 మంది విద్యార్థులకు రూ.10 లక్షల చెక్కులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి కురువెళ్ల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కడవెండి శ్రీనివాస్, పసుమర్తి సాంబశివరావు, వేములపల్లి నగేష్, బిద్యాల ఈశ్వరరావు, చెరుకూరి ముత్తయ్య, కురివెళ్ల కాంతారావు, మేళ్లచెరువు హన్మంతరావు, బోనగిరి వెంకటేశ్వర్లు, శ్రీరామ్, రమేష్ బాబు, వందనపు శ్రీనివాసరావు, నాళ్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తదానం

ఖమ్మంమయూరిసెంటర్: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహం (బీ) విద్యార్థులు ఆదివారం రక్తదానం చేశారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన రక్తదానం చేసిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ.. ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కస్తాల మాట్లాడుతూ.. ఎస్సీ కళాశాల వసతిగృహాల్లో విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో ముందుంటారన్నారు. తలసేమియా చిన్నారులకు రక్తం కొరత విషయాన్ని తెలుసుకొని వసతిగృహం నుంచి రక్తదానం చేసే విద్యార్థులను పంపించామని, త్వరలోనే చిన్నారుల కోసం వసతిగృహాల విద్యార్థులతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. చిన్నారులకు అవసరమైన ఇతర సేవలు అందేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డి.నారాయణ మూర్తి, సంకల్ప సంస్థ కోశాధికారి పి.రవిచందర్, పి.అనిత, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ

● ఘనంగా గంగమ్మ జాతర



నేలకొండపల్లిలో బోనాలతో వస్తున్న మహిళలు

మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. నేలకొండపల్లి, బోదులబండ, సింగారెడ్డిపాలెం తదితర గ్రామాల్లో జాతర నిర్వహించగా.. మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా గంగమ్మ దేవాలయాలకు చేరుకున్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకుని పూజలు చేశారు. – నేలకొండపల్లి

ఆర్టీసీ క్లర్క్ పరీక్షలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీలో క్లర్క్ పోస్టుల కోసం పరీక్ష రాసే అభ్యర్థులకు ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక మంచికంటి హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రభుత్వ అధికారి, ఎస్‌డబ్ల్యూఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు తూములూరి వెంకటేశ్వరరావు పాల్గొని అభ్యర్థులకు పరీక్ష రాసే విధానంపై అవగాహన కల్పించారు. అంతేకాక అభ్యర్థుల్లో ఉన్న పలు అనుమానాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి, ఉపాధ్యక్షుడుఎ.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంబాబు, పిట్టల సుధాకర్, తోకల బాబు, రోశయ్య, పద్మ, సునీత, సరిత తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసస్తూ ఈనెల 22న ఇల్లెందు క్రాస్‌రోడ్‌లోని ఖమ్మం టీటీడీసీలో సేవాలాల్ సేన ఆధ్వర్యాన నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు పలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మా తండాలలో మా రాజ్యం కావాలని, గిరిజనులకు అన్ని రంగాల్లో జనాభా దమాషా ప్రకారం వాటా ఇవ్వాలన్నారు. సేవాలాల్ మహరాజ్ మేరామ యాడీ ఆలయాలకు ధూపనైవేద్యాల కింద నెలకు రూ.15,000లు ఇవ్వాలని, ఏజెన్సీ ప్రాంతాల్లె 1/70 యాక్టు చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోకన్వీనర్ కిషన్‌నాయక్, జిల్లా కన్వీనర్ శ్రీకాంత్‌నాయక్, నాయకులు రాజ్‌కుమార్, పృథ్వీ, బాబు, కుమార్, శ్రీను, దేవేందర్ తదతరులు పాల్గొన్నారు.

సాయినాథుడికి జలాభిషేకం



మున్నేటి నుంచి జలాలను తీసుకెళ్లేందుకు వచ్చిన భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని హర్కారాబావి రోడ్ రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ కృష్ణసాయి ఆశ్రమంలో బాబాకు ఆదివారం నదీ జలాలతో ప్రత్యేక అభిషేకం చేశారు. సాయి మాలాధారణ చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో సాయి కీర్తనలు ఆలపిస్తూ ఊరేగింపుగా మున్నేటికి చేరుకొని 108 కలశాల్లో నీటిని నింపిఆశ్రమానికి తీసుకొచ్చి బాబా వారికి అభిషేకం చేశారు. ఆశ్రమ చైర్మన్ లగడపాటి రామారావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి సిద్దంశెట్టి నాగమణి, చొడవరపు మధుసూదన్‌రావు, కొదుమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. గాంధీచౌక్‌లోని శ్రీ వరప్రదాత షిర్డీసాయి మందిరంలో బాబావారికి అన్నాభిషేకం నిర్వహించి, నవనారసింహ సహిత నవగ్రహ హోమం నిర్వహించారు. మందిర చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

102 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు



ఖమ్మంవన్‌టౌన్: చెక్కు అందజేస్తున్న మేయర్ నీరజ, తదితరులు

ఖమ్మంవన్‌టౌన్/తిరుమలాయపాలెం: ఖమ్మంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో ఆదివారం వివిధ డివిజన్లకు చెందిన వారికి మేయర్ పునుకొల్లు నీరజ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్‌తో కలిసి ఆమె 80మందికి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్పొరేటర్లు, నాయకులు మలీదు జగన్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్, పల్లెబోయిన చంద్రం, మిక్కిలినేని నరేందర్, చామకూర వెంకటేశ్వర్, అంజిరెడ్డి, నాళ్లం సతీష్, జాకీర్, బ్రహ్మరెడ్డి, పాలెపు వెంకటరమణ, పాలకుర్తి నాగేశ్వరరావు, కొప్పెర ఉపేందర్, బాణాల లక్ష్మణ్, సింగం అంజయ్య, సీతమ్మ, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుమలాయపాలెం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. కూసుమంచిలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ తదితరులు ఈ చెక్కులను అందించారు.

ఏకకాలంలో రుణమాఫీ అమలు చేయాలి



మాట్లాడుతున్న బందెల వెంకయ్య

తిరుమలాయపాలెం: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి నేటికీ మాఫీ చేయకుండా అభిప్రాయ సేకరణ పేరుతో కాలయాపన చేస్తూ.. రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకుడు బందెల వెంకయ్య ఆరోపించారు. ఆదివారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ వెంటనే అమలు చేయాలని కోరతూ ఈ నెల 22న తహసీల్దార్ కార్యాలయాల ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కార్యకర్తలు, రైతులకు పిలుపునిచ్చారు. అలాగే 29న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు సైతం తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, పులుగుజ్జు వెంకటస్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



నేలకొండపల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్యులు



జల్లేపలి వైద్య శిబిరంలో వైద్యుడు రంజిత్

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని రావెళ్ల భవన్‌లో నూతక్కి గంగాధర్‌రావు సేవా కమిటీ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో వైద్యులు రాజేష్, అనుదీప్‌లు బాధితులను పరీక్షించి అవసరమైన మందులు అందించారు. రూ.100లకే నెలకు సరిపడా బీపీ, షుగర్ మాత్రలు అందించారు. వసుంధర కాలేజీ విద్యార్థులు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సేవా కన్వీనర్ ఏటుకూరి రామారావు, గ్రామీణ వైద్యుల సేవా సంఘం ప్రతినిధులు బండి పుష్పలత, బండారుపల్లి నాగేశ్వరరావు, తానీషా, వసుంధర కాలేజీ ప్రిన్సిపాల్ ఈగ అనిల్‌కుమార్, సీపీఎం నాయకులు కట్టికోల వెంకటేశ్వర్లు, వి.భాస్కర్‌రావు, దండా సూర్యానారాయణ, సామాల మల్లిఖార్జున్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జల్లేపల్లిలో..

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లేపల్లి గ్రామంలో జ్వరాల తీవ్రత నేపథ్యాన పొంగులేటి స్వరాజ్యం రాఘవరెడ్డి(పీఎస్ఆర్) ట్రస్ట్ సమక్షంలో ఆదివారం ఖమ్మం కిమ్స్ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మెడిసిన్ డాక్టర్ రంజిత్ రావెళ్ల, ఆర్థోపెడిక్ డాక్టర్ రవీంద్రనాథ్‌చౌదరి బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ కాకర్లమూడి అనిల్, మండల ఎంపీపీ బోడ మంగీలాల్, నాయకులు పొట్ల కిరణ్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఆస్పత్రిలో వ్యర్థాలు..!





రోగాలను నయం చేసుకునేందుకు వచ్చే వారికి.. కొత్త రోగం వచ్చేలా ఆస్పత్రి ఆవరణలో వ్యర్థాలను పడేస్తున్నారు. నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఇదిగో ఇలా ఎక్కడపడితే అక్కడ కుప్పలుకుప్పలుగా వ్యర్థాలు పడేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు సైతం స్వైరవిహారం చేస్తుండడంతో ఆస్పత్రికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు ఆస్పత్రిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- నేలకొండపల్లి